


# కరపత్రం

SINCE 2014

గురువారం నవంబర్ 28 2024 | సంపుటి :0 | సంచిక : 50 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతోంది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమిటని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.
- హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్రకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
- బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప కాంగ్రెస్ సాధించిందేమీ లేదన్నారు.



2లో

# ఎన్డీఎస్ఏ చెప్పిన పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు : వెదిరె శ్రీరామ్



**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి కేంద్ర జల్‌శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ కాళేశ్వరం కమిషన్‌కు అఫిడవిట్ సమర్పించారు.**

హైదరాబాద్: అవసరమైన పరీక్షలు పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం వివరాలు అందించకపోవడం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదిక ఆలస్యం అవుతోందని కేంద్ర జల్‌శక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ తెలిపారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరైన ఆయన.. కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై అఫిడవిట్ సమర్పించారు. గతంలో కమిషన్‌కు చెప్పిన అంశాలను ఇవాళ అఫిడవిట్ రూపంలో అందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రణాళిక మొదలు మేడిగడ్డ ఆనకట్ట పియర్స్ కుంగడం వరకు అన్ని అంశాలను అఫిడవిట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఇటీవలి పరిణామాలను సైతం అఫిడవిట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నట్లు. జూ నిపుణుల కమిటీ నివేదిక అంశంపై అఫిడవిట్‌లో ప్రస్తావించా. నివేదిక ఆలస్యానికి గల కారణాలను కమిషన్‌కు వివరించాను. ఎన్డీఎస్ఏ చెప్పిన పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా పూర్తి చేయలేదు. ఎన్డీఎస్ఏ సిఫారసు చేయనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఇంజినీర్లు బ్యారేజీ కింద ఉన్న గుంతలను పూడ్చివేశారు. దాంతో బ్యారేజీల కింద జియో టెక్నికల్ డేటాను కోల్పోయాం. ఇదే విషయాన్ని ఎన్డీఎస్ఏ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం పోలీసులు విశ్వ ప్రయత్నాలు

- తిరుపతన్న బెయిల్ పిటిషన్ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా



2లో

తెలంగాణ రాష్ట్రంలో పోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపిందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీసు అధికారులు బెయిల్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారికి ప్రతీసారీ నిరాశే మిగులుతోంది.

# భారాస కాజేసిన భూముల వివరాలు బయటకు తీస్తాం: డిప్యూటీ సీఎం భట్టి

- **తిరుపతన్న బెయిల్ పిటిషన్ డిసెంబర్ 18వ తేదీకి వాయిదాధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని భారాస నేతలు వేలాది ఎకరాల భూమిని కాజేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు.**



హైదరాబాద్: ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని భారాస నేతలు వేలాది ఎకరాల భూమిని కాజేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. భారాస కాజేసిన భూముల వివరాలు బయటకు తీస్తామని స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. మంత్రివర్గ విస్తరణపై పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. పసలేని విమర్శలతో ప్రతిపక్షాలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. అభివృద్ధి చూసి ఓర్వలేక కొందరు కాకుల్లా అరుస్తున్నారు. హైడ్రా, మూసీ విషయంలో ఆలోచన చేశాకే ముందుకు పోతున్నాం. మూసీ విషయంలో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. మూసీ నిర్వాసితులు వ్యాపారాలు చేసుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.



## అధికారులు నిద్రపోతున్నారా?: మాగనూర్ ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

- తిరుపతన్న బెయిల్ పిటిషన్ డిసెంబర్ 18వ తేదీకి వాయిదానారాయణపేట జిల్లా మాగనూర్ జడ్పీ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ప్రజాపాలన అంటే నిర్బంధాలా..?

- **నిర్బంధాలతో ఉద్యమాలు ఆగుతాయా?**
- **కాంగ్రెస్ పాలనను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత**

ప్రజాపాలన అంటూ చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు,



2లో

# మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం

**బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసిన పోలీసులు**



మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనకు వెళ్తారనే అనుమానంతో బుధవారం తెల్లవారు జామున మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

2లో

# పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు

- నాటి ప్రభుత్వంలో ఠంఛన్ వచ్చేది..
- కాంగ్రెస్ హయాంలో 20 దాటినా రాని పరిస్థితి
- ట్విటర్ వేదికగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి కేటీఆర్



2లో

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో వృద్ధులు ఎవరి మీద ఆధారపడకుండా మందు బిళ్లలు, ఇంటి నిత్యావసరాలు పింఛన్ డబ్బులతో తెచ్చుకునేవారని, కానీ కాంగ్రెస్ పాలనలో అది సాధ్యం కావడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఏలుబడిలో వృద్ధులు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్నారన్నారు. నెలానెలా సరైన సమయంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు,

# సంపాదకీయం

## 'మహా' ఫలితాల మతలబు ఏమిటి?

ప్రజల సమస్యలు, సానుభూతి పవనాలు, తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత, భావోద్వేగపరమైన అంశాలు ఆధారంగా ఎన్నికల్లో విజయం సాధించడం భారతదేశంలో సర్వసాధారణం. 1998లో ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు విపరీతంగా పెరిగినందుకు బీజేపీ ప్రభుత్వం పరాజయం పాలయింది. 'పేదలు ఉల్లిగడ్డలు ఎప్పుడూ తినరు.. కేవలం పై వర్గాలే ఉల్లిగడ్డలు తింటాయి' అని వ్యాఖ్యానించి ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నందుకు బీజేపీ అధిష్ఠానం సాహెబ్‌సింగ్ వర్మతో రాజీనామా చేయించి సుష్మా స్వరాజ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. తొలి కేబినెట్ సమావేశంలోనే ఉల్లిగడ్డల ధరలను తగ్గించేందుకు సుష్మా స్వరాజ్ నిర్ణయం తీసుకున్నారు. కాని అప్పటికే బీజేపీ సర్కార్ పట్ల ప్రజా వ్యతిరేకత ప్రబలడంతో ఓటమిపాలై షీలా దీక్షిత్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2013లో షీలాదీక్షిత్ సర్కార్ ఓడిపోవడానికి కూడా ఉల్లిగడ్డల ధరల పెరుగుదల ఒక కారణమవడం విశేషం.

అధిక ధరలు, నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, కుంభకోణాలు, అత్యాచారాలు విద్యుత్ ఛార్జీల పెరుగుదల వంటివి అనేక సందర్భాల్లో దేశంలో ఎన్నికల ఫలితాలను నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి వాటి వల్ల ప్రభుత్వాలు ఓడిపోయాయని ఎవరైనా చెప్పగలరా? దేశంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వల్ల ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. తెలుగుదేశం, బిజూ జనతాదళ్ లాంటి పార్టీలు అలా అధికారంలోకి వచ్చినవే. జాతీయ స్థాయిలో ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ మరణం కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించాయి. యూపీఏ హయాంలో కుంభకోణాలు, అవినీతి వల్ల 2014లో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభంజనం వీచిందనడంలో సందేహం లేదు. మతపరమైన భావోద్వేగాలను బీజేపీ ఎన్నికలకు ఉపయోగించుకోవడం కూడా ఎవరూ కాదనలేని విషయం. కర్ణాటకలో యడ్యూరప్ప హయాంలో అవినీతి, అక్రమాలు, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలన, వ్యవహారశైలి పట్ల వ్యతిరేకత, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అరాచక పాలన కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించిన విషయం అందరికీ తెలుసు.స్థూలంగా చూస్తే రాజకీయ పార్టీల తలరాతలు ప్రజా వ్యతిరేక, ప్రజా అనుకూల తరంగాల ఆధారంగా నిర్ధారితమవుతాయి. కొన్నిసార్లు అంతర్గతంగా ప్రజా వ్యతిరేకత చాప క్రింద నీరులాగా ప్రవేశిస్తుంది. కాని ఇది కూడా కనిపెట్టలేనిది కాదు. స్థానికంగా పర్యటించినప్పుడు, ప్రజలతో మాట్లాడినప్పుడు అర్థం అవుతుంది. 'నేను మా ఊళ్లో అడుగుపెట్టినప్పుడు నన్నెప్పుడూ బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారి నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. ఆమె నాకు ఏమీ చెప్పలేదు కాని నాకు ఓడిపోతానన్న విషయం మాత్రం అర్థమైంది' అని దివంగత కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒకసారి మాటల సందర్భంలో చెప్పారు. అందువల్ల నేతలు తమ గెలుపోటముల గురించి లీలగానైనా అంచనా వేయగలరనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం వీస్తుందని కొన్ని సంస్థలు తేల్చినా అది 240 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసిన వారు కూడా లేకపోలేదు. ప్రజలకు ఒక పార్టీ పట్ల మోజు తగ్గినా, ప్రతిపక్ష పార్టీ పట్ల కూడా సానుకూలత లేనప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడతాయని 2024లోనే కాదు, అంతకు ముందు కూడా రుజువైంది. ప్రభంజనం ఉన్నదా లేదా, పైకి కనపడని ప్రజా వ్యతిరేకత ఉన్నదా లాంటి అంశాలు ఎన్నికల ప్రచార సమయంలోనూ, పోలింగ్ రోజు, పోలింగ్ శాతంలోనూ కూడా వ్యక్తమవుతాయి. అదే సమయంలో పూర్తి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ బూత్‌ల స్థాయి వ్యూహరచన, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను తమ వైపునకు తిప్పుకోవడం, భారీ ఎత్తున డబ్బులు పంచిపెట్టడం వల్ల ఎన్నికల ఫలితాలు తారుమారు అవుతాయని చెప్పడానికి వీల్లేదు. అలా చేయగలిగిన శక్తి ఉన్నప్పటికీ అధికార పార్టీలు పరాజయం చెందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నృత్యం చేయలేని నర్తకి నాట్యవేదికను నిందించినట్లు సాధారణంగా ఓడిపోయిన పార్టీలు ఈవీఎంలను మేనేజ్ చేశారనో, రిగ్గింగ్ జరిగిందనో నిందలు వేస్తాయి. అయితే కొన్ని ఫలితాలు అనూహ్యంగా వచ్చినప్పుడు అందుకు కారణాల గురించి లోతుగా చర్చించడం అనావశ్యకం మాత్రం కాదు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇలాంటి చర్చలకే దారి తీస్తున్నాయి. ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు ఒకప్పుడు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్లు హరియాణా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ప్రభావితం చేయగలిగిన సమస్యలు ఎన్నో ఉన్నాయి. పదేళ్ల ప్రజా వ్యతిరేకత, భారీ ఎత్తున నిరుద్యోగం, కనీస మద్దతు ధర వంటి రైతాంగ సమస్యలు, పట్టణ ఓటర్ల అసంతృప్తి, మహిళా మల్లయోధుల నిరసనలు, పూర్తి చేయని ఎన్నో హామీల వల్ల పదేళ్ల తర్వాత హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, ఇండియా టుడేతో పాటు పలు పత్రికలు, సర్వే సంస్థలు కూడా అంచనా వేశాయి. కాని ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హరియాణా ఎన్నికల ఫలితాలు వచ్చాయని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. కాని ఈ ఆరోపణలపై అంతగా చర్చ జరగలేదు. ఇవి మచ్చలేని ఎన్నికలు అని ఎన్నికల కమిషన్ అభివర్ణించింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం పోలీసులు విశ్వ ప్రయత్నాలు

మొదటిపేజీ తరువాయి

ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీస్ అధికారి తిరుపతన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం అదనపు ఎస్పీ తిరుపతన్న సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరింది. దీంతో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కౌంటర్ దాఖలుకు రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్నను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. తిరపతన్నకు బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం (అక్టోబర్ 24న) న్యాయస్థానం విచారణ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఛార్జ్‌షీట్ ఫైల్ చేసి మూడు నెలలు అయిన తర్వాత కూడా హైకోర్టు బెయిల్ ఎందుకు నిరాకరించిందని ధర్మాసనం ప్రశ్నిస్తూ.. తరుపరి విచారణను నవంబర్ 27కు వాయిదా వేసింది. ఈరోజు విచారణ జరిపిన సుప్రీం కోర్టు తదుపరి డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న తిరుపతన్నకు ఇటీవల హైకోర్టు బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం నిరాకరించింది. తిరుపతన్న ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్న నేపథ్యంలో బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో బెయిల్ ఇస్తే... దాన్ని వల్ల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. పోలీసుల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నివేదిక ప్రకారం దర్యాప్తు చేయాలని ఖాకీలను కోర్టు ఆదేశించింది. అలాగే తిరుపతన్నకు బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేస్తూ.. ఈ కేసును హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైకోర్టును తీర్పును సవాల్ చేస్తూ తిరుపతన్న సుప్రీంను ఆశ్రయించారు.

# రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతోంది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

"సమస్యలపై మాట్లాడితే నా డీఎన్‌ఏ ఏంటని మాట్లాడుతున్నారు.. నాది భారతీయ జనతా పార్టీ డీఎన్‌ఏ. మిగతావారి మాదిరిగా పది పార్టీలు తిరిగిన డీఎన్‌ఏ కాదు. డిసెంబరు 1 నుంచి 5 వరకు కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం. ఇప్పటికైనా నిర్మాణాత్మకంగా పాలనపై కాంగ్రెస్ దృష్టి పెట్టాలి. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలతో తెలంగాణ నష్టపోతోంది. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతోంది. భారాస, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే" అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# అధికారులు నిద్రపోతున్నారా?:

## మాగనూర్ ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: నారాయణపేట జిల్లా మాగనూర్ జడ్పీ హైస్కూల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించింది. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ చాలా తీవ్రమైన అంశమని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తరచూ భోజనం వికటిస్తోందని కోర్టు దృష్టికి ఆయన తీసుకెళ్లారు.

"వారంలో మూడుసార్లు భోజనం వికటిస్తే అధికారులు ఏం చేస్తున్నారు? పిల్లలు చనిపోతే తప్ప స్పందించరా?అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు"అని హైకోర్టు ఆక్షేపించింది. వారంలో కౌంటర్ వేస్తామన్న ప్రభుత్వ న్యాయవాదిపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా కేంద్రంలో ఉండే అధికారిని సంప్రదించి వివరాలు సేకరించడానికి వారం వ్యవధి ఎందుకని ప్రశ్నించింది. "హైకోర్టు ఆదేశాలు ఇస్తేనే అధికారులు పనిచేస్తారా? వారికి కూడా పిల్లలున్నారు కదా! మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే 5 నిమిషాల్లో హాజరవుతారు" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను న్యాయస్థానం సోమవారానికి వాయిదా వేసింది.

మాగనూర్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది అస్వస్థతకు గురై వారం రోజులు కాకుండానే.. అదే పాఠశాలలో మళ్లీ 29 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. మంగళవారం మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థుల ఇళ్లకు తిరిగి వెళ్తున్న సమయంలో వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. 29 మందిలో ఏడుగురు వెంటనే కోలుకోగా.. మిగిలిన 22 మందిని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 280 kmph వేగంతో హైస్పీడ్ రైళ్లు..

## ఈ ఫీచర్లతో: రైల్వేమంత్రి వెల్లడి

దేశంలో హైస్పీడ్ రైళు రానున్నాయి. 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా వీటి రూపకల్పన జరుగుతున్నట్లు రైల్వే మంత్రి వెల్లడించారు.



దిల్లీ: దేశంలో త్వరలో హైస్పీడ్ రైళ్లు రాబోతున్నాయి. దీనికి సంబంధించిన పనులు ఇప్పటికే మొదలయ్యాయి. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. బీఈఎంఎల్‌తో కలిసి చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ రైళ్ల డిజైన్, తయారీ కొనసాగుతోందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. భాజపా ఎంపీ సుధీర్ గుప్తా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

వందేభారత్ రైళ్లు విజయవంతం అయిన నేపథ్యంలో మేకిన్ ఇండియా స్ఫూర్తితో హైస్పీడ్ రైళ్ల తయారీ చేపట్టినట్లు వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ఒక్కో కార్‌కు (బోగీ) ట్యాక్సులు మినహాయించి రూ.28 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఇతర బోగీలతో పోలిస్తే ఈ ఖర్చు ఎక్కువని పేర్కొన్నారు. అయితే, హైస్పీడ్ రైళ్ల సెట్ల తయారీ సంక్లిష్టమని, సాంకేతిక అంశాలు ఇందులో ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. సాధారణ రైళ్లతో పోలిస్తే వీటి ఏరోడైనమిక్ భిన్నంగా ఉంటాయని వైష్ణవ్ చెప్పారు. గాలి చొచ్చుకోవడానికి వీల్లేకుండా బాడీ ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం అన్నీ చైర్ కార్సే ఉంటాయని చెప్పారు. అత్యాధునిక ఫీచర్లు ఉంటాయని పేర్కొన్నారు. ఆటోమేటిక్ డోర్స్, బోగీకి బోగీకి మధ్య అనుసంధానం, బయటి వాతావరణానికి అనుగుణంగా బోగీ లోపలి పరిస్థితులు, సీసీటీవీ, మొబైల్ ఛార్జింగ్ సదుపాయం, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉంటాయని పేర్కొన్నారు. డిజైన్ పూర్తయ్యాక ప్రాజెక్ట్ పూర్తికి అయ్యే వ్యయంపై ఓ అవగాహన వస్తుందని వైష్ణవ్ తెలిపారు.

# ప్రజాపాలన అంటే నిర్బంధాలా..?

మొదటిపేజీ తరువాయి

ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బందిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం

మొదటిపేజీ తరువాయి

పోలీసులు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన నేతలను అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు నారాయణపేట పోలీసులు తరలించారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫాయిజన్‌తో విద్యార్థులు అవస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి.. ఠాణాకు తరలించారు. పోలీసుల అత్యుత్సాహంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు

మొదటిపేజీ తరువాయి

వికలాంగులు తీవ్ర ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో చోట పింఛన్ల కోసం రోడ్డెక్కుతున్న ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో పింఛన్ వృద్ధులు రోడ్డెక్కి వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీసుల్లో ఇచ్చేవారని.. నవంబర్ 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లోనే వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు. తెలంగాణాలో పింఛన్ల కోసం కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు.. టంచన్‌గా అకౌంట్లో పడే పడే పైసలు ఆగిపోతాయని ఎవరునుకున్నారు? అన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి.. కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని అనుకున్నారన్నారు. మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమే లేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే 'మార్పు' వస్తుందని ఎవరు ఊహించారని.. అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నారు..? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నారు? అంటూ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

# ఎన్డీఎస్ఏ చెప్పిన పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం చేయలేదు : వెదిరె శ్రీరామ్

మొదటిపేజీ తరువాయి



జియో టెక్నికల్ పరీక్షలు ఇక సాధ్యం కాదని.. కొన్ని చోట్ల జియో ఫిజికల్ పరీక్షలు చేసి వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఎన్డీఎస్ఏకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి డేటా అందలేదని, డేటా అందిన తర్వాత రెండు నెలలకు నివేదిక ఇస్తామని ఎన్డీఎస్ఏ తెలిపింది" అని వెదిరె శ్రీరాం పేర్కొన్నారు.

# ఎగసిన అదానీ కంపనీ షేర్లు

# తల దించుకున్న లిబ్రాండూలు

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

నిన్న బుధవారం భారత షేర్ మార్కెట్లో అదానీ కంపనీ షేర్లు దాదాపు 20 శాతం లాభంతో మార్కెట్ ను ముంచెత్తాయి.అదానీ గ్రీన్ ఎనర్జీ నిన్న ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాలోని "యు.ఎస్ డిపార్ట్ మెట్ ఆఫ్ జస్టిస్" నిన్న జారీ చేసిన స్పష్టీకరణ ప్రకారం గౌతమ్ అదానీ,సాగర్ అదానీ,సీనియర్ ఎక్జిక్యూటివ్ వినీత్ జైన్ లపై మూడు అభియోగాలు మోపబడ్డాయని వచ్చిన వార్తల్లో నిజం లేదని, అదానీ గ్రూప్ డైరెక్టర్లపై ఎలాంటి నేరారోపణ జరగలేదని,వారికి క్లీన్ చిట్ ఇచ్చారని ప్రకటన వెలువడిన వెంటనే ఎన్.ఎస్.ఈ లో అదానీ గ్రూప్ షేర్లు లాభాలతో ముగిసాయి.ఇందులో అదానీ టోటల్ గ్యాస్ మరియు అదానీ పవార్ 20 వృద్ధిని సాధించాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ,అదానీ ఎనర్జీ 10 శాతం, అదానీ ఎంటర్ ప్రైజేస్ 11 శాతం, అదానీ పోర్ట్స్ 5.9 శాతం, అదానీ విల్మర్ 8 శాతం వృద్ధితో లాభాలు ఆర్జించాయి.ఏ.సి.సి సిమెంట్ అంబుజా సిమెంట్ 4 శాతం, ఎన్.డి.టి.వి 9 శాతం వృద్ధిని సాధించాయి.




**అదానీ లీగల్ కౌన్సిల్:**

మాజీ అటార్నీ జనరల్ సీనియర్ లీగల్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ మరియు ప్రముఖ సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మహేష్ జెత్మలానీ లు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ లో ఛార్జ్ షీట్ కు సమానంగా యు.ఎస్ ఇండిక్ట్ మెంట్ ను భావిస్తారు.అదానీ గ్రూప్ కంపెనీలపై మోపిన ఏ అభియోగంలోను అదానీ ఇతరుల పేర్లు లేవని, అదానీ గ్రూప్ పైన అసత్య ప్రచారం జరిగిందని ఈ ఇద్దరు న్యాయవాదులు ప్రకటించారు.ఇలా తప్పుడు ప్రచారం చేయడం కూడా నేరమని,వ్యక్తుల లేదా కంపెనీల హక్కులను అడ్డుకునే కుట్ర అని తెలిపారు.ఈ కుట్రకు కాంగ్రెస్ తో పాటు ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారం కారణమని అన్నారు.

**మూడీస్ కార్పొరేషన్:**

అమెరికాలో ప్రపంచ ప్రసిద్ధ మూడీస్ అదానీ కంపెనీలకు క్లీన్ చిట్ విడుదల చేసింది.మూడీస్ ప్రపంచ కంపెనీల పనితీరుకు, ఆర్థిక వ్యవహారాల పనితీరుకు, పెట్టుబడుల తీరుకు రేటింగ్స్ జారీ చేస్తుంటుంది.అదానీ పంపనీలపై ఉన్న నెగెటివ్ అభిప్రాయం నుండి స్థిరమైన ధృఢమైన అభిప్రాయాన్ని వెలువరించింది.భారత కంపెనీల ఎదుగుదలను ఓర్చుకోలేని అమెరికా అదానీ,అంబానీ లంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని భారతీయులు ఎప్పటికప్పుడు వమ్ము చేస్తున్నారు.ప్రపంచ ఆధిపత్యం కొరకు మాత్రమే పనిచేసే అమెరికా కుట్రలను చేధిస్తున్న భారత్ ను,మోడీ ని, భారత పారిశ్రామిక వేత్తలను ఎలా టార్గెట్ చేస్తున్నారో, చైనా పారిశ్రామిక వేత్త " జాక్ మా" ను ఎలా బద్నాం చేసారో రేపు తెలుసుకుందాం

## మేడ్చల్ రాజకీయాల కోటగోడ గౌడవెల్లి

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్**




మేడ్చల్ రాజకీయాలకు, ముఖ్యంగా మండల రాజకీయాలకు కేంద్ర బిందువు గౌడవెల్లి గ్రామం.రాజకీయ నాయకులను ఉత్పత్తి చేసే యంత్రం అని గౌడవెల్లి కి పేరుంది. దశాబ్దాలుగా గౌడవెల్లి తన పేరు నిలుపుకుంటూ వస్తున్నది.ఒకేసారి మూడు ప్రధాన పార్టీలకు మండల అధ్యక్షులను అందించిన చరిత్ర ఈ గ్రామానిది.గౌడవెల్లి కి చెందిన సింగిరెడ్డి వెంకట్రాం రెడ్డి ఎం.ఎల్.సి గా పనిచేసారు చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మంత్రిగా పనిచేసారు.ఆయన మరణం తర్వాత వారి సతీమణి శ్రీమతి ఉమాదేవి రెండు సార్లు ఎం.ఎల్. ఏ గా ఎన్నికయ్యారు. ఒకసారి మంత్రిగా పనిచేసారు.గౌడవెల్లి చెందిన సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ గా పనిచేసారు. పి.సి.సి సీనియర్ లీడర్ గా పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేసారు.గౌడవెల్లి కి చెందిన దయానంద్ యాదవ్ టి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, నరేందర్ రెడ్డి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడిగా, రమణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు, ఇంకా తమ తమ పార్టీలకు సేవలందిస్తున్నారు.గౌడవెల్లి కి చెందిన పద్మజగన్ రెడ్డి ఎం.పీ.టి.సి గా గెలిచి మండల అధ్యక్షురాలిగా పనిచేసారు.ఇదే గ్రామం నుండి డైరెక్టర్ గా ఎన్నికైన రణదీప్ రెడ్డి మేడ్చల్ సహకార సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు.నిన్నటి వరకు గ్రామ సర్పంచ్ గా పనిచేసిన సురేందర్ ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా భాధ్యతలు నిర్వహించారు.గౌడవెల్లి రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు.గౌడవెల్లి కి చెందిన నాయకులు అందరూ చిన్న వయస్సు వారే కావడం, రాజకీయ వ్యూహ ప్రతి వ్యూహాలతో మేడ్చల్ రాజకీయాలను రక్తి కట్టిస్తున్నారు.గౌడవెల్లి తర్వాతి స్థానాన్ని గుండ్ల పోచంపల్లి ఆక్రమించింది.జిల్లా బిజెపి అధ్యక్షుడిగా పనిచేసిన విక్రమ్ రెడ్డి, నియోజక వర్గ బిజెపి పార్టీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యురాలిగా పనిచేసిన శ్రీమతి సరస్వతి గారు గుండ్ల పోచంపల్లి కి చెందిన వారే.మండల జెడ్.పి.టి.సి గా పని చేసిన సాయిపేట శ్రీనివాస్ యాదవ్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గా పనిచేస్తున్న శ్రీమతి లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి గారు గుండ్ల పోచంపల్లి కి చెందినవారే.మేడ్చల్ మండల లోని ఇతర గ్రామాల నాయకులు గౌడవెల్లి గ్రామ నాయకులతో, గుండ్ల పోచంపల్లి నాయకులతో పోటీ పడుతున్నా గౌడవెల్లి, గుండ్ల పోచం పల్లి గ్రామాలు తమ అస్థిత్వాన్ని నిలుపుకుంటూనే ఉన్నాయి.గౌడవెల్లి గ్రామ రాజకీయ ఆధిపత్య కోట ఎంతకాలం పటిష్టంగా ఉంటుందో? గ్రామ రాజకీయం, ఏ గ్రామ నాయకులు ప్రాముఖ్యత సాధిస్తారో రాబోయే కాలం మాత్రమే చెబుతుంది.రాబోయే రాజకీయ చదరంగంలో ఎవరు దూసుకు పోతారో, ఎవరు ఆధిక్యంలోకి వస్తారో...చూడాల్సిందే.

## మహిళాప్రయాణికులతో
## కిటకిటలాడుతున్న మెట్ పల్లి బస్టాండ్.

**... ఇబ్బంది పడుతున్న వయోవృద్ధులు ,వికలాంగులు**

**కరపత్రం మెట్ పల్లి, నవంబర్ 27. జగిత్యాల జిల్లా మెట్ పల్లి**



బస్టాండులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఉచితబస్ లో ప్రతినిత్యం వందలాది మహిళా ప్రయాణికులు తో కిటకిటలాడుతుంది. బస్సులో సీటు కొరకు మహిళా ప్రయాణికులు బస్సు ఎక్కడానికి ఒకరిపై ఒకరు పోటీ పడడంతో వయోవృద్ధులు వికలాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు .ప్రతినిత్యం మహిళలు బస్సులో దేవస్థానాలని, విందులకు, షాపింగ్ లకు,, అవసరము ఉన్న లేకున్నా కొందరైతే సమయం గడవడాని కొరకు ప్రయాణం చేస్తున్నారని అంటున్నారు. చుట్టాల మార్గం ఉదయం వెళ్లి సాయంత్రం కల్లా మళ్లీ ఇంటికి వచ్చి చేరుతున్నారు. ఏ బస్టాండ్ లో చూసినా మహిళలతో కిటకిట లాడుతుందని పురుష ప్రయాణికులు అంటున్నారు. బస్సులో డబ్బులు చెల్లించి నిలబడి ప్రయాణం చేసే పరిస్థితి మగ ప్రయాణికులకు ప్రభుత్వం దుస్థితి తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులో కెపాసిటీ కన్నా నిలబడి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు అంటున్నారు . కొన్ని ప్రాంతాలకు ప్రతినిత్యం పందలాదిమంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు టి జి ఎస్ ఆర్ టి సి అధికారులు అంటున్నారు . మెట్పల్లి బస్ డిపో పరిధిలో ఖానాపూర్, కొం డ్రికర్ల, గుమ్మి రియాల్, ఆత్మకూర్, జగిత్యాల, ఆర్మూర్ , వి విరావుపేట్, వాల్గొండ ప్రాంతాలకు విరివిగా ప్రయాణం చేస్తున్నట్లు డ్రైవర్లు అంటున్నా రు. కొన్ని సందర్భాల్లో పుట్ బోర్డు పై ప్రయాణం చేస్తున్న ఓప్రయాణికులకు డ్రైవర్లు, కండక్టర్లు పుట్ బోర్డుపై ప్రయాణం చేయవద్దని చెప్పినా ప్రయాణం చేసే సాహసం చేస్తున్నారు. ఒక బస్సులో రెండు బస్సుల ప్రయాణికులుప్రయాణిస్తుండడంతో బస్సుల జీవితకాలం తొందరగా చెల్లుబాటు అవుతుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి ప్రయాణికుల రద్దీ తగ్గే విధంగాఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉందని పురుషప్రయాణికులుచర్చించుకుంటున్నారు. బస్సులో ఫిట్నెస్ తగ్గిపోతుందని టీజీఎస్ఆర్టిసి అధికారులు అంటున్నారు. మెట్టుపల్లి బస్టాండును మాడల్ బస్టాండ్ గా తీర్చిదిద్దడానికి నా వంతు కృషి చేస్తానని టీజీఎస్ఆర్టిసి మెట్పల్లి డిఎం దేవరాజు అన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా త్రాగే నీరు, బాలింతలకు పిల్లలకు పాలు పట్టడానికి ఒక రూమును ఏర్పాటు చేసినట్లు డిఎం దేవరాజు తెలిపారు.

## దీక్ష దివాసును విజయవంతం చేయండి

**– బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచురి శ్రీధర్ పిలుపు**

**కరపత్రం ధర్మారం నవంబర్ 27 :**

నవంబర్ 29న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే దీక్ష దివాసును విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్మారం మండల కేంద్రంలో బుధవారం రోజున విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ మాట్లాడుతూ: తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన కెసిఆర్ దీక్షను గుర్తు చేసుకుంటు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నవంబర్ 29 నిర్వహించే దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులంతా తరలివచ్చి దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## మార్కెట్ కమిటీ బరిలో వినోద్ నాయక్

**కరపత్రం నిజాంపేట్ ప్రతినిది....**



రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్టి కి కేటాయించడం జరిగింది.అందుకుగాను నిజాంపేట మండలం బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన రమావత్ వినోద్ నాయక్ పోటీలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలియడం జరిగింది. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ పార్టీలో నియమ నిబంధనలు పాటించుకుంటూ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ఏనాడు కూడా వేరే పార్టీ వైపు చూడకుండా పనిచేశాడని అన్నారు. స్థానిక మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అండదండలు కూడా ఉన్నట్టు తెలుస్తుంది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అండ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుల మద్దతు ఉన్నట్లు తెలుస్తుంది. కష్టకాలంలో కూడా పార్టీకి అండదండగా ఉంటూ సేవలందించిన పేరు కూడా వినోద్ నాయక్ ఉన్నది.

## విద్యార్థులు ఉపాధ్యాయులుగా వైద్యులుగా ఉన్నత స్థాయికి చేరాలి.

**... కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

**....జ్ఞానోదయ లో కోరుట్ల ఎమ్మెల్యే కు సన్మానం.**

**కరపత్రం మెట్ పల్లి, నవంబర్ 27.**

జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని జానోదయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ని ఘనంగా సన్మానించారు. మెట్పల్లి లోజ్ఞానోదయ డిగ్రీ అండ్ పి జి కళాశాల వారి ఆధ్వర్యంలో ఆయుర్వేద సిద్ధాంతి మొట్టమొదటి వైద్యుడు ధాన్యంతరి జయంతి పురస్కరించుకొని కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరైనారు. ఈ సందర్భంగా తెలంగాణలోనే ఉన్నత స్థానంలో మంచి డాక్టర్ గా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన క మన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విద్యార్థులు ,కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ అధ్యాపక బృందం ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు విద్యపై దృష్టి సాదించాలని రాబోవు ఉపాధ్యాయులుగా వైద్యులుగా అలాగే ఉన్నత ఉద్యోగులుగా ఉన్నత స్థాయికి చేరాలని ఆశిస్తున్నానని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే కళాశాల పేరు ,తల్లిదండ్రుల పేరు , గురువుల పేరు నిలబెట్టిన వారవుతారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.

ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ ,ప్రిన్సిపాల్ సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ రాజు , అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.

## యుద్ధ కళా యోధుడు బ్రూస్లీకి ఘనంగా జన్మదిన వేడుకలు.

**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, నవంబర్ 27.**

జగిత్యాల జిల్లా కేంద్రంగా మార్షల్ ఆర్ట్స్ యోధుడు బ్రూస్ లీ 84వ జయంతి వేడుకలు జె .కె.ఎ. ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ప్రధాన బ్రాంచ్, మెట్ పల్లి కరాటే బ్రాంచ్, బండా లింగాపుర్ కరాటే బ్రాంచ్ లలో బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది.జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు మాస్టర్ ప్రవీణ్ కుమార్, కరాటే శిక్షకులు వంశీ నాయుడు, నవీన్ మాస్టర్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో ముందుగా బ్రూస్ లీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరము కరాటే విద్యార్థులకు స్వీట్లు, కేకులు పంపిణి చేశారు.మార్షల్ ఆర్ట్స్ కు ప్రపంచ ఖ్యాతి రావడానికి బ్రూస్ లీ పాత్రను జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్ కుమార్ కరాటే క్రీడాకారులకు వివరించారు. బ్రూస్ లీ 33 ఏళ్లకే తనువు చాలించినప్పటికీ మార్షల్ ఆర్ట్స్ లో చిరస్థాయిగా తన పేరు సజీవంగా ఉండేలా ఆయన పలు మార్గదర్శకాలు చూపారన్నారు. యువ కరాటే క్రీడాకారులందరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని మాస్టర్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం నవంబర్ 28 2024



టాలీవుడ్

# హాయ్.. నేను రానా దగ్గుబాటిలో సందడి చేసిన శ్రీలీల, జొన్నల గడ్డ

యాక్టర్ రానా దగ్గుబాటి కాంపౌండ్ నుంచి వస్తోన్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. హాయ్.. నేను రానా దగ్గుబాటి.. అవును ఇది ఒక షో. కానీ మీరంతా ఈ షో దేని గురించి ఆశ్చర్యపోతున్నారు. నాకింకా ఏం తెలియదు.. అంటూ రానా షేర్ చేసిన ఇంట్రో వీడియో ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా సెకండ్ ఎపిసోడ్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ ఎపిసోడ్‌లో సిద్దు జొన్నలగడ్డ, శ్రీలీల సందడి చేశారు. డీజే టిల్లు స్టైల్‌లో సిద్దు, శ్రీలీల మధ్య వచ్చే ప్రోమో ఫన్‌గా సాగుతూ క్యూరియాసిటీ పెంచుతోంది. సరదా చిట్‌చాట్, ఆటపాటలతో ఎపిసోడ్ ఉండబోతున్నట్టు ప్రోమో హింట్ ఇచ్చేస్తుంది. ఈ ప్రోమోపై ఓ లుక్కేయండి మరీ. ఫుల్ ఎపిసోడ్ శనివారం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఫస్ట్ ఎపిసోడ్‌లో నాని, తేజ సజ్జా, ప్రియాంకా అరుళ్ మోహన్ గెస్టులుగా హాజరయ్యారు. టాక్ షో నెక్స్ట్ ఎపిసోడ్స్‌లో నాగచైతన్య, ఎస్ఎస్ రాజమౌళి, దుల్కర్ సల్మాన్, రాంగోపాల్ వర్మ, మీనాక్షి చౌదరి, రిషబ్ శెట్టి లాంటి స్టార్ సెలబ్రిటీలతో సందడిగా సాగనుంది.

# కాబోయే భర్తను పరిచయం చేసిన కీర్తి సురేష్



దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తట్టిల్‌తో ఏడడుగులు వేయబోతున్నారంటూ తమిళ మీడియాతో పాటు ఇటు తెలుగులో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో కీర్తి తాజాగా కీలక ప్రకటన చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నిజం చేస్తూ.. తన బాయ్‌ఫ్రెండ్‌ను కీర్తి సురేశ్ తాజాగా పరిచయం చేశారు. ఆంటోని తట్టిల్‌తో 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఇద్దరూ సూర్యుడివైపు చూస్తున్న ఓ అందమైన ఫొటోను పంచుకున్నారు. ట్వీట్‌కు లవ్ సింబల్‌తో అని క్యాప్షన్ పెట్టారు. ఈ ట్వీట్ చూసిన అభిమానులు, నెటిజన్లు కీర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆంటోనీ దుబాయ్‌కి చెందిన వ్యాపారవేత్త అని తెలిసింది. వీరిద్దరూ కలిసి ఒకే పాఠశాలలనే చదివినట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ హైస్కూల్ ప్రేమికులు ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. కాగా, డిసెంబర్ రెండో వారంలో డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని సమాచారం. డిసెంబర్ 11, 12 తేదీల్లో గోవాలో గ్రాండ్ వెడ్డింగ్ జరగబోతోందంట. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నట్లు తెలిసింది. అయితే, తమ మధ్య ఉన్న రిలేషన్ షిప్ గురించి ఓపెన్ అయిన కీర్తి సురేశ్.. పెళ్లి గురించి మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.

# డాక్యుమెంటరీపై కోర్టును ఆశ్రయించిన ధనుష్...

## నయన దంపతులపై దావా



లేడీ సూపర్ స్టార్ నయనతార.. తమిళ స్టార్ ధనుష్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న నయన్ డాక్యుమెంటరీ విషయంలో ధనుష్ వెనక్కి తగ్గడం లేదు. ఈ డాక్యుమెంటరీలో తన అనుమతి లేకుండా 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారంటూ రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ ఇప్పటికే డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంపై ధనుష్ కోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా నేను రౌడీనే సినిమా విజువల్స్‌ను వాడుకున్నారని ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ మద్రాస్ హైకోర్టులో దావా వేసింది. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై కూడా దావా వేసింది. ధనుష్ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. విచారణకు అంగీకరించింది.కాగా, నయన్.. ధనుష్ మధ్య గతకొంత కాలంగా వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. నయనతార పెళ్లితో పాటు ఆమె జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారు. ఆ క్లిప్పింగ్‌ను డాక్యుమెంటరీలో వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నయనతారకు లీగల్ నోటీసులు కూడా పంపారు. ఈ క్రమంలోనే ధనుష్‌ని లక్ష్యంగా చేసుకొని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. చట్టపరంగా తేల్చుకుంటానని తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ధనుష్ కోర్టును ఆశ్రయించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# నా కేరీర్‌లో ఎక్కువ కష్టపడింది వర్షం సినిమాకే : త్రిష



తమిళ బ్యూటీ త్రిష కృష్ణన్ వర్షం సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన ఈ చిత్రం 2004లో వచ్చి మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా త్రిషకు ఉత్తమ నటిగా ఫిలిం ఫేర్ అవార్డు తెచ్చిపెట్టింది. అయితే తన కెరీర్‌లో ఇప్పటివరకు అత్యంత కష్టపడిన సినిమా అంటే వర్షం సినిమానే అని చెప్పుకోచ్చింది ఈ భామ. రీసెంట్‌గా ఒక తమిళ అవార్డుల వేడుకలో పాల్గోన్న త్రిష కృష్ణన్ తన అమ్మ ఉమ కృష్ణన్‌తో హాజరైంది. అయితే అవార్డు తీసుకోవడానికి వేదికపైకి త్రిష వెళ్లగా.. యాంకర్ త్రిష అమ్మను అడుగుతూ.. త్రిష కృష్ణన్ తన కెరీర్‌లో ఏ సినిమాకు అత్యంత కష్టపడిందని అడుగుతుంది. దీనికి ఉమ కృష్ణన్ మాట్లాడుతూ.. త్రిష కెరీర్‌లో చాలా కష్టపడిన చిత్రం వర్షం. ఈ సినిమా కోసం 45 రోజులు వర్షంలోనే గడిపాం. ఇదంత చూసి ఈ సినిమా మానేసి చెన్నైకి వెళదాం అనుకున్నాం. కానీ ధైర్యంతో ముందుకు నడిచాం. ఈ సినిమా విడుదలయ్యాక మా కష్టం అంతా మర్చిపోయం. సినిమా చాలా పెద్ద హిట్ అయ్యింది. అని చెప్పగానే.. త్రిష కూడా అవును వర్షం సినిమాకే నేను చాలా కష్టపడ్డాను అంటూ చెప్పుకోచ్చింది. వర్షం సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది త్రిష. తెలుగులో నువ్వొస్తానంటే నేనొద్దంటానా, అతడు, పౌర్ణమి, స్టాలిన్, సైనికుడు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, కృష్ణ, బుజ్జిగాడు వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో కలిసి విశ్వంభర అనే పాన్ ఇండియన్ సినిమాలో నటిస్తుంది.

# అక్కినేని చిన్నకోడలు బ్యాక్ గ్రౌండ్ మీకు తెలుసా..?



యువ హీరో అక్కినేని అఖిల్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఆయన నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగింది. ఈ విషయాన్ని అఖిల్ తండ్రి, అగ్ర నటుడు నాగార్జున మంగళవారం తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. అయితే, ప్రస్తుతం అక్కినేని ఇంటికి కాబోయే కోడలు జైనబ్ గురించి తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఆమె ఎవరు..? బ్యాగ్రౌండ్ ఏంటి..? అంటూ నెటిజన్లు, అక్కినేని అభిమానునలు తెగ సెర్చ్ చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గురించి ఆసక్తికర విషయాలు మీకోసం.. సోషల్ మీడియా కథనాలు, టాలీవుడ్ సర్కిల్ నుంచి అందిన సమాచారం ప్రకారం.. 27 ఏళ్ల జైనబ్‌కు చాలా పెద్ద బ్యాగ్రౌండే ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో పుట్టిన జైనబ్ రవ్జీ ముంబైలో స్థిరపడినట్లు సమాచారం. ఆమెకు చిత్రకారిణి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి పేరుంది. మన దేశంలోనే కాకుండా దుబాయ్, లండన్‌లోనూ ప్రదర్శనలిచ్చినట్లు తెలిసింది. అంతేకాదు.. ఎంఎఫ్ హుస్సేన్ దర్శకత్వంలో 'మీనాక్షి: ఎ టేల్ ఆఫ్ థ్రీ సిటీస్' సినిమాలో కూడా జైనబ్ రవ్జీ యాక్ట్ చేశారు. ఆ సినిమాలో సీనియర్ హీరోయిన్ టబు, కునాల్ కపూర్ నటించారు. పెయింటర్‌గా మంచి పేరున్నా.. జైనబ్ రవ్జీ చాలా లో-ప్రొఫైల్ మెయిన్‌టెయిన్ చేస్తుంటారు. ఇక ఆమె తండ్రి జుల్ఫీ రవ్జీ రియల్ ఎస్టేట్ టైకూన్. ఈ రంగంలో ఆయనకు 30 ఏళ్ల అనుభవం ఉంది. అంతేకాదు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్య సలహాదారునిగా పనిచేశారు. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా సేవలు అందించారు. అఖిల్‌తో జైనబ్ ఎంగేజ్మెంట్ వేళ.. జుల్ఫీ రవ్జీని నవంబర్ 13, 2019న ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తూ జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఇప్పుడు వైరల్‌గా మారింది. జుల్ఫీ రైవ్జీ కుటుంబానికి వేల కోట్ల ఆస్తులున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో అక్కినేని కుటుంబానికి ఎంత పేరు ప్రఖ్యాతలున్నాయో.. గల్ఫ్ దేశాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో జుల్ఫీ రవ్జీకి అంత పేరుంది. మిడిల్ ఈస్ట్ దేశాల్లోనే ఒక పెద్ద రియల్ ఎస్టేట్ టైకూన్‌గా ఆయన పేరుగాంచారు. ఇక నాగార్జున, జుల్ఫీ రవ్జీకి కొన్నేళ్లుగా స్నేహ బంధం కూడా ఉన్నట్లు తెలిసింది. ఆ స్నేహానికి తోడు అఖిల్-జైనబ్ మధ్య ప్రేమ ఈ రెండు కుటుంబాలను మరింత దగ్గర చేయబోతోంది. ఇక నాగార్జున పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం డిసెంబర్ 4వ తేదీన అంగరంగ వైభవంగా జరగనున్న విషయం తెలిసిందే. వీరి వివాహం అయిన తర్వాత ఓ మంచి ముహూర్తం చూసి అఖిల్ జైనబ్ పెళ్లి కూడా చేయాలని అక్కినేని కుటుంబం భావిస్తున్నట్లు తెలిసింది.

# సూర్య, రాంచరణ్ పేర్లు చెప్పిన డైరెక్టర్ నార్తన్



కన్నడ స్టార్ యాక్టర్ శివరాజ్‌కుమార్ హీరోగా నార్తన్ డైరెక్ట్ చేసిన బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఈ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన భైరథి రణగల్‌తో మరో హిట్టందుకున్నాడు నార్తన్. కాగా ఈ టాలెంటెడ్ డైరెక్టర్ నెక్స్ట్ సినిమాపై చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. నా కొత్త ప్రాజెక్టు కేవీఎన్ ప్రొడక్షన్స్ తో చేయబోతున్నా. కానీ హీరోపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. లీడ్ రోల్ కోసం సూర్య, రాంచరణ్ పేర్లను పరిశీలిస్తున్నాం. కన్నడ యాక్టర్ పేరు కూడా ఉంది. హీరోను ఫైనల్ చేసిన తర్వాత ప్రొడక్షన్ హౌస్ నుంచి అధికారిక ప్రకటన చేస్తామని చెప్పాడు నార్తన్. రాంచరణ్ నార్తన్‌తో సినిమా చేయబోతున్నాడని చాలా కాలంగా పుకార్లు తెరపైకి వస్తున్నా.. ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఇప్పుడిక నార్తన్ టాలీవుడ్ యాక్టర్ రాంచరణ్ పేరు ప్రస్తావించడంలో దాదాపు ఈ ప్రాజెక్ట్‌లో ఫైనల్ అయిపోయినట్టేనని అభిమానులు తెగ ఎక్జయిట్ అవుతున్నారు. రాంచరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఆర్‌సీ 16 సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. మరోవైపు సూర్య ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజు, ఆర్జే బాలాజీ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో మరి ఇద్దరిలో ఏ యాక్టర్ ముందుగా నార్తన్‌కు డేట్స్ కేటాయిస్తాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.